ప్రజాశక్తి
ఆదివారం 12 జనవరి 2025
5
విజయనగరం

కోడి పందేల నిరోధానికి బృందాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడి పందేలు జరగకుండా చూసేందుకు మండల స్థాయి సంయుక్త తనిఖీ బృందాలు ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. తహశీల్దార్, ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు, జంతు సంక్షేమ కమిటీ సభ్యులతో కూడిన ఈ బృందాలు ఆయా మండలంలో కోడి పందేలు జరగకుండా నిరోధించేందుకు చర్యలు చేపట్ట వలసి ఉంటుంది. ఆయా మండలంలో ప్రజలకు ఈ బృందాలు కోడి పందాలు జరగకుండా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కోడి పందేలు జరిగే అవకాశాలు వున్న మైదానాలను గుర్తించి వాటిలో పందేలు జరగకుండా నిరోధించాలని ఆదేశించారు. పందేలు నిర్వహించేందుకు సిద్ధం చేసిన సామాగ్రిని, పరికరాలను సీజ్ చేసే అధికారం కూడా ఈ సంయుక్త తనిఖీ బృందాలకు కల్పించారు.

జిఒ 117 రద్దు పేరుతో
తెలుగుకు మంగళం?

ఏరు దాటకా బోడి మల్లన్న అన్నా చందంగా టిడిపి కూటమి ప్రభుత్వం వైఖరి ఉంది. ఎన్నికల ముందు జీవో 117ను పూర్తిగా రద్దు చేస్తామని, తెలుగు మీడియంను కొనసాగిస్తామని, ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేస్తామని చెప్పిన ప్రభుత్వం జీవో 117 రద్దు పేరుతో తీసుకుంటున్న మార్పులు ప్రభుత్వ విద్యారంగాన్ని తిరోగమనం వైపు నడిపిస్తున్నాయన్న చర్చ జరుగుతోంది. పేద విద్యార్థులకు తెలుగు మీడియం చదువుకు దూరం చేసేలా ఉన్నాయని పలువురు విద్యావేత్తలు అంటున్నారు. ప్రధానంగా ఎన్‌సిఇఆర్‌టి కోర్సును ప్రవేశపెట్టడం వల్ల తెలుగు మీడియం రద్దయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

- ఇంగ్లీష్ మీడియాన్ని బలవంతంగా రుద్దనున్న ప్రభుత్వం
- 113 ప్రైమరీ పాఠశాలలు హైస్కూల్స్ నుంచి వెనక్కి వచ్చే అవకాశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో సంస్కరణలు అమలు చేస్తూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117ను రద్దు చేసింది. ఆ జీవో రద్దు చేసినా ఇంచుమించు అవే విధానాలను అమలు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం గతంలో హైస్కూల్లో విలీనం చేసిన 3,4,5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలల్లోకి వెనక్కి వస్తాయి. ఇది శుభ పరిణామమేనని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు. ఈలెక్కన గతంలో ఉన్నత పాఠశాలల్లో విలీనమైన ఉమ్మడి జిల్లాలోని 113 ప్రాథమిక పాఠశాలలు తిరిగి గత పాఠశాలల్లో కొనసాగే అవకాశం ఉంది. ప్రభుత్వం ప్రీ హైస్కూలు విధానాన్ని రద్దు చేసి మోడల్ ప్రైమరీ స్కూల్స్‌ను తీసుకొస్తుంది. ప్రాథమిక పాఠశాలల్లో కూడా 60 మంది విద్యార్థులపైన ఉన్న పాఠశాలలన్నీ మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా రూపొందిద్దుకుంటే ఈ మోడల్ ప్రైమరీ పాఠశాలలను పంచాయతీకి ఒకటి చొప్పున ఉండే పరిస్థితి ఉంది. విద్యార్థులు ఎక్కువ ఉంటే రెండు మోడల్ స్కూళ్లు కూడా వచ్చే అవకాశం ఉంది. దీనిబట్టి ఉమ్మడి విజయనగరం జిల్లాలో సుమారు 920 మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. దీనివల్ల యుపి స్కూల్స్ పూర్తిగా రద్దవుతాయి. విద్యార్థుల సంఖ్య 30 కంటే తక్కువగా ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను మోడల్, బేసిక్ ప్రైమరీగా మార్చనున్నారు. 6,7,8 తరగతుల విద్యార్థులను దగ్గరలోని పాఠశాలలకు తరలిస్తారు. విద్యార్థుల సంఖ్య 60 కంటే ఎక్కువగా ఉంటే దాన్ని హైస్కూలుగా మార్చనున్నారు. ఈ లెక్కన జిల్లాలో పలు ప్రాథమికోన్నత పాఠశాలలు విలీనం కానున్నాయి. గతంలో యుపి స్కూళ్లలో సబ్జెక్ట్ టీచర్స్‌గా స్కూల్ అసిస్టెంట్స్ ఉండేవారు.వీరంతా తిరిగి హైస్కూల్‌లో విలీనమయ్యే అవకాశం ఉంది. కొందరు ఎస్‌జిటిలు కూడా హైస్కూల్లో పని చేసేవారు, వారిని కూడా వెనక్కి పంపించనున్నారు. ఈసారి జరిగే హేతుబద్ధీకరణలో ఉపాధ్యాయుల స్థానచలనం ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుంది. హైస్కూల్ ప్లస్‌ను రద్దు చేయడంతో ఆ విద్యార్థులంతా దగ్గరలోని ప్రభుత్వ కళాశాలలకు తరలనున్నారు. జీవో నెంబర్ 117 రద్దుకు సంబంధించిన ప్రతిపాదనల వల్ల బదిలీలు, హేతుబద్ధీకరణలో న్యాయపరమైన చిక్కులు ఎక్కువగా వచ్చే అవకాశముందని విద్యావేత్తలు అంటున్నారు. ముఖ్యంగా పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రతిపాదన వలన పంచాయతీలో చుట్టుపక్కల ఉన్న అనుబంధ గ్రామాల విద్యార్థులు ఆ మోడల్ స్కూల్లో జాయిన్ అవుతారా? లేదా ప్రైవేట్ స్కూల్‌కు వెళ్తారా అనేది చూడాల్సి ఉంది. ప్రభుత్వం కొత్తగా అన్ని తరగతులకూ ఎన్‌సిఇఆర్‌టి సిలబస్‌ను ప్రవేశపెట్టడంతో తెలుగు మీడియం రద్దయ్యే అవకాశం ఉంది.

కొత్త సీసాలో పాత సారా చందమే

విద్యాశాఖ జీవో నెంబర్ 117ను రద్దు చేయడం సంతోషమే. కానీ ఈ నూతన ప్రతిపాదనలో లేదా డ్రాఫ్ట్ కొత్త సీసాలో పాతసార చందాన ఉంది. ముఖ్యంగా ఉన్నత పాఠశాలలో తెలుగు మీడియంతో ఇంగ్లీష్ మీడియం కూడా సమాంతరంగా సాగించాలి. ప్రస్తుతం ఉన్నటువంటి విషయాలను విశ్లేషిస్తే ఉపాధ్యాయుడికి భారం ఎక్కువగానే ఉంది. కావున ఈ డ్రాఫ్ట్‌ను మార్చవలసిన అవసరం ఉంది. హైస్కూళ్లు దూరంగా ఉన్న ప్రాంత్లాల్లో యుపి స్కూళ్లను కొనసాగించాలి.

- డి.ఈశ్వరరావు, ఎపిటిఎఫ్ (1938) రాష్ట్ర ఉపాధ్యక్షులు

జిఒ 117 రద్దయినట్లేనా?

3,4,5 తరగతులను హైస్కూల్స్ నుంచి వేరుచేసి ప్రాథమిక పాఠశాలల్లో కలిపినంత మాత్రాన జీవో 117 రద్దు అయినట్లు కాదు. ప్రాథమిక విద్య మాతృభాషలోనే కొన సాగాలి. హైస్కూల్స్‌లో సమాంతర మాధ్యమం కొనసాగాలి. యుపి స్కూల్స్‌ను ఉంచాలి. హైస్కూల్స్‌లో ప్లస్ 2 కూడా కంటిన్యూ చేయాలి. ప్రభుత్వ విధానాలు ప్రభుత్వ బడులను బలోపేతం చేసే విధంగా ఉండాలి.

-డి రాము.
యుటిఎఫ్ రాష్ట్ర విద్యా సబ్ కమిటీ సభ్యులు

సమాంతర విద్యను అమలుచేయాలి

ప్రభుత్వ విద్యా రంగంలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలు రెండింటినీ సమాంతరంగా అమలు చేయాలి. తెలుగు మీడియంలో విద్య కొనసాగింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకుండా బలవంతంగా ఇంగ్లీష్ మీడియంను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. దీనిని మేము వ్యతిరేకిస్తున్నాం.

- డి.శ్యామ్, ఎస్‌టియు రాష్ట్ర నాయకులు

డ్రోన్లను పరిశీలిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కొండపల్లి శ్రీనివాస్

డ్రోన్ల వినియోగానికి పెద్దపీట

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ● సెంచూరియన్‌లో డ్రోన్ల తయారీ యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో డ్రోన్ల తయారీ యూనిట్ ఏర్పాటు ఉత్తరాంధ్రకు ఓ మణికిరీటం వంటిదని కేంద్ర పౌరవిమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం ఆయన సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో సూపర్ బీ ఏరోనాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రోన్ల తయారీ యూనిట్‌ను రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ డ్రోన్ల తయారీ యూనిట్ ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు వాటిపై అవగాహన కల్పించడంతోపాటు పరిశ్రమలకు, మార్కెట్ అవసరాలను తీర్చడానికి దోహదపడుతుందన్నారు. వ్యవసాయ రంగంలో పురుగుల మందు వాడకాన్ని తగ్గించాలన్నా, వ్యవసాయ సాగు ఖర్చులు తగ్గాలన్నా డ్రోన్ల వినియోగం పెరగాలన్నారు. అందువల్లనే ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోడీ డ్రోన్ల వాడకాన్ని పెంపొందించేందుకు పిఎల్ఐ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో డ్రోన్ల హబ్ ఏర్పాటు చేసేందుకు డ్రోన్ పాలసీని తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో పలు ప్రాంతాలలో డ్రోన్ల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి వాడకాన్ని పెంపొందించాలన్న ఆలోచనలో చంద్రబాబు ఉన్నారన్నారు. భవిష్యత్‌లో డ్రోన్లకు సంబంధించి ఉత్తరాంధ్రకు సెంచూరియన్ ప్రధాన కేంద్రంగా మారబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన జైరోప్లేన్ (తక్కువ ఎత్తులో ఎగిరే విమానం), ఇ-రిక్షాల తయారీ, కుట్టు యంత్రాల యూనిట్, ఆర్గానిక్ ఫార్మింగ్, ఎఆర్విఆర్ ల్యాబ్, 3డి ప్రింటింగ్, ఇతర పరికరాలు, విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు తిలకించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో సాధించిన అభివృద్ధి గురించి విశ్వవిద్యాలయ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డి.ఎన్.రావు వారికి వివరించారు.

హెల్త్ కేర్ ఆన్ వీల్స్ ప్రారంభం

ఈ సందర్భంగా సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్త్ కేర్ ఆన్ వీల్స్ వాహనాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి మాట్లాడుతూ కేవలం బయట ఆసుపత్రులలో వివిధ వైద్య పరీక్షలకు రూ.2వేలు వసూలు చేసే పరిస్థితి ఉండగా ఈ వాహనం ద్వారా కేవలం రూ.200 పలు రకాల వైద్య పరీక్షలు చేసుకునే వీలుందన్నారు. వైద్య సేవల కోసం ఈ వాహనం అన్ని పంచాయతీలలో పర్యటించనుందని వివరించారు.

అవగాహనా ఒప్పందం

ముంబయికి చెందిన స్మార్ట్ విలేజి మూమెంట్ సిఇఒ వివేక్ షా సెంచూరియన్‌తో అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ వర్మ, బెంగుళూరులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కు చెందిన ప్రొఫెసర్ రాధాకాంత్ పాఢి, వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డి.ఎన్.రావు సతీమణి పద్మ, గ్రామ్ తరంగ్ అండ్ సూపర్ బీ ఏరోనాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట్ శివానంద్, యాజమాన్య ప్రతినిధి ఎస్. రవీంద్ర, పలువురు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

వడ్డే ఓబన్న చరిత్ర.. భావితరాలకు స్ఫూర్తిదాయకం

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

భారత దేశంలో సిపాయిల తిరుగుబాటుకు ముందు స్వతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహా రెడ్డితో కలిసి వడ్డే ఓబన్న బ్రిటీష్ వారితో వీరోచితంగా పోరాడారని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమంలో పాల్గొని ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఓబన్న చరిత్రను, వీరగాథను భావితరాలు స్మరించే సంకల్పంతో రాష్ట్ర పభుత్వం అధికారికంగా జయంతి కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు . కార్యక్రమంలో రాష్ట తూర్పు కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పాలవలస యశస్వి , జిల్లా రెవిన్యూ అధికారి శ్రీనివాస మూర్తి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి పెంటోజీ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి

మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి

ప్రజాశక్తి-గజపతినగరం

తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే, ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి తెలిపారు. శనివారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. యుటిఎఫ్‌తోపాటు మరికొన్ని సంఘాల మద్దతుతో ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ తరపున బరిలో నిలిచినట్లు తెలిపారు. మొదట ప్రాధాన్యత ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో తనను గెలిపించాలని కోరారు.

కెజిబివి టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలు చాలావరకు పరిష్కరించామన్నారు. ఎంటిఎస్, హెచ్‌ఆర్ సాధనే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ రూల్స్ అమలు, కారుణ్య నియమాల కోసం కృషి చేస్తానన్నారు. కాలేజీ కాంట్రాక్టు, గెస్ట్ లెక్చరర్ల సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉందని, వాటిపై చిత్తశుద్ధితో కృషి చేస్తానని తెలిపారు. గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ టీచర్ల, లెక్చరర్ల న్యాయమైన డిమాండ్ల సాధనే లక్ష్యంగా పనిచేస్తానని వెల్లడించారు.

కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, కోశాధికారి సిహెచ్.భాస్కరరావు, కార్యదర్శి అల్లు శంకర్రావు, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి అప్పారావు, ఆడిట్ కమిటీ కన్వీనర్ రాంప్రసాద్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు బి.కాంతారావు, గజపతినగరం, దత్తిరాజేరు, మెంటాడ మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో ఆటల పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సంక్రాంతి నేపథ్యంలో ఐద్వా ఆధ్వర్యాన శనివారం రామకృష్ణా నగర్‌లో ఆటల పోటీలు నిర్వహించారు. మ్యూజికల్ ఛైర్, కర్చీఫ్ గేమ్, అంత్యాక్షరీ తదితర ఆటలు ఆడించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పి రమణమ్మ మాట్లాడుతూ సంక్రాంతి పండగ సందర్భంగా పిల్లలకు క్రీడాపోటీలు నిర్వహించడం ద్వారా వారిలో మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి వి.లక్ష్మి, నాయకులు ఎం.జగదాంబ, కె.రమణమ్మ, డి.కరుణ తదితరులు పాల్గొన్నారు.

ఆటలాడుతున్న చిన్నారులు

సొంతూళ్లకు చేరుకుంటున్న ప్రజలు

పల్లెబాట పట్టిన వలస జీవులు

జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారంతా సంక్రాంతికు పల్లె బాట పట్టారు. హైదరాబాద్, చెన్నై, విజయవాడ, తెనాలి, తదితర ప్రాంతాలకు వెళ్లిన వారంతా సొంత గ్రామాలకు వస్తున్నారు. దీంతో శనివారం పట్టణంలోని రైల్వేస్టేషన్, ఆర్‌టిసి కాంప్లెక్స్ జనంతో కిటకిటలాడాయి. సంక్రాంతికి వస్తున్న వారు రైళ్లు, బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు.

- ప్రజాశక్తి, బొబ్బిలి

పైపులైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తాటిపూడి పాత బ్రిడ్జి వద్ద ఏర్పడిన పైపులైను మరమ్మత్తు పనులను నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. పైప్ లైన్ లీకవుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు స్పందించిన కమిషనర్ హుటాహుటిన అధికారులను అప్రమత్తం చేశారు. తాటిపూడి పాత బ్రిడ్జి వద్దకు చేరుకొని పైప్ లైన్ లికుల మరమ్మత్తు పనులను సరి చేశారు. దీంతో నీటి పంపిణీకి మార్గం సుగమమైంది.

ఇజనారానికి వొట్నేదురా..!

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'ఇంతోటి బతుకూ ఇల్లాకాతలకే...! అన్నట్టుగా ఉందిరా మోడీ మాటలు. ఇంత కష్టపడి ఇశాకపట్నం వచ్చామా? సలి సూడు ఎలాగా వంచేత్తాంది.... అట్నుంచి బయలుదేరినప్పుడు బాగానే ఉందిగానీ, ఇప్పుడు సూడు ఆ మోడీ మన ఇజనారం గురించి ఒక్కమాట కూడా ఆడలేదు. మనం మాత్రం మన నాయకుల మాటలు నమ్మేసి ఎగోసుకుని వచ్చినాము.' ఇది నాలుగు రోజుల క్రితం విశాఖలోని మోడీ సభకు వెళ్లొచ్చిన మన జిల్లా వాసుల నోట వినిపిస్తున్న మాటలు. పాపం... ఓ వైపు నాయకుల పోరు భరించలేక... మరోవైపు ఏదో పొరుగునే ఉన్న మన ఇజానారం కోసమూ మాట్లాడకపోతారా? కనీసం విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌పైనైనా ఒక క్లారిటీ ఇవ్వకపోతారా? అంటూ భావించినవారికి నిరాశే ఎదురైంది. ఇందుకు కారణం లేకపోలేదు. రాష్ట్ర విభజన సందర్భంగా అప్పటి కాంగ్రెస్ పార్టీ ఐదేళ్ళు ప్రత్యేక హోదా ప్రకటిస్తే ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో ఐదు కాదు... తాము అధికారంలోకి వస్తే పదేళ్లపాటు ప్రత్యేక హోదా కల్పిస్తామని నమ్మబలికారు. అంతే కాదు... విభజన చట్టంలోవున్న వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు ఇస్తామన్నారు. హోదా ఎలాగూ ఇవ్వలేదు. కనీసం ప్రత్యేక నిధులైనా కేటాయిస్తే మన జిల్లా ఎంతోకొంత అభివృద్ధి చెందేది. ఆ మాత్రం సాయం కూడా చేయలేదు. 'ఇవన్నీ తెలియనివి కాకపోయినప్పటికీ, మోడీ విశాఖ రావడం, ఆయన సభకు వందల ఆర్టీసి బస్సులు మళ్లించడం, ఇవిచాలవన్నట్టు ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల బస్సులను కూడా జనాన్ని తరలిచేందుకు ఉపయోగించడం, అందుకోసం ఏకంగా ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు అనధికారికంగా సెలవు



ఇచ్చేయడంతో మన జిల్లా అభివృద్ధికి కేంద్రం ఏదో చేస్తుందని ఆశపడ్డామని, ఆ ఆశలన్నీ సభలోనే ఆవిరిగా మిగిలిపోయాయని జనం చర్చించుకుంటున్నారు. అభివృద్ధి సంగతి పక్కనబెడితే పదేళ్లగా కేంద్రంలో వెలగబెడుతున్న బిజెపి ప్రభుత్వం జిల్లాకు చేసిందేమీ లేదు సరికదా వివక్ష చూపుతోందని జనం చర్చించుకుంటున్నారు. ఇందుకు తగ్గట్టే విభజన హామీలో భాగంగా మంజూరు చేసిన గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ఐదేళ్లు పట్టగా, నిధులు మంజూరు చేసి నిర్మాణాలు మొదలు పెట్టడానికి మరో ఐదేళ్లు సాగింది. ఇప్పటికీ ఆ నిర్మాణ పనులు పునాదుల స్థాయిలోనే ఉండడంతో వర్శిటీ తరగతులు పరాయి పంచల్లో సాగుతున్నాయి. జిల్లా పరిధిలోగల మూడవ రైల్వే లైను నిర్మాణ పనులు నత్తనకడకన సాగుతున్నాయి. మానాపురం, చీపురుపల్లి తదితర చోట్ల చేపట్టిన ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాల్లో పురోగతి లేదు. ఇటువంటి చోట్ల ప్రయాణికుల అవస్థలు జిల్లా వాసులకు ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు.

అధికారంలోకి రాకముందు విజయనగరం రైల్వే స్టేషన్‌ను మోడల్‌గా తీర్చిద్దుతామన్న మాటలు నేడు వినిపించకుండా పోయాయి. రైలు మార్గానికి అనుసంధానంగా తలపెట్టిన మామిడి మార్కెట్ యార్డు కాగితాలకే పరిమితమైంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ అంటే కేవలం విశాఖపట్నం మాత్రమే కాదు సుమా..! మన జిల్లాకు చెందినవారు వేల సంఖ్యలో అందులో ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్టు వర్కర్స్, చిన్న చితక కాంట్రాక్టర్లుగా ఉన్నారు. ఈ రకంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మన జిల్లాకు ఎంతో అనుబంధం, ఆర్థిక సంబంధం ఉంది. ఇటువంటి ప్లాంట్‌ను బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ విదేశీ ప్రైవేటు సంస్థకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో మోడీ ఏదో చేస్తారని ఆశతో వెళ్లిన వారు పుట్టెడు నిరాశతో 'అనవసరంగా వచ్చాము' అంటూ చర్చించుకోవడం వినిపిస్తోంది.

ఎస్‌టి కమిషన్ చైర్మన్‌ను కలిసిన ఎస్ఇ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విజయనగరం క్యాంప్ ఆఫీస్ లో ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డి వి జి శంకరరావును జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీరింగ్ అధికారి లక్ష్మణరావు మర్యాద పూర్వకంగా కలిసి ముందుగా భోగి,సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో ఉన్న గిరిజన గ్రామాల్లో విద్యుత్ సదుపాయాలు, లక్ష్యాలు, గిరిజన గ్రామాలకు, వ్యక్తిగత లబ్దిదారులకు ఉచితంగా అందించనున్న సోలార్ ప్యానెల్ ఏర్పాటు పథకం, పిఎం సోలార్ ఘర్ స్థితిగతులపై చర్చించారు. జిల్లా అధికారితో పాటు డిఇఇ కె.కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకరరావుకు పూలమొక్కను అందజేస్తున్న ఎస్ఇ లక్ష్మణరావు

ప్రజాశక్తి
www.prajasakti.com

ఐఎఎస్ అధికారి శివశంకర్‌కు పితృ వియోగం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఐఎఎస్ అధికారి, ప్రస్తుతం ఆరోగ్యశ్రీ తెలంగాణ రాష్ట్రం ముఖ్య కార్యనిర్వాహణ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఐఎఎస్ అధికారి లోతేటి శివశంకర్‌కు పితృ వియోగం కలిగింది. ఆయన తండ్రి ఎస్.కోట మండలం ధర్మవరం గ్రామానికి చెందిన లోతేటి సన్యాసప్పడు (78) శనివారం సాయంత్రం ధర్మవరంలో కనుమూశారు. సన్యాసప్పుడు వైద్య ఆరోగ్యశాఖలో హెల్త్ సూపర్‌వైజర్‌గా ఉద్యోగం చేశారు. ఆయన కుమారుడైన శివశంకర్ శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఐటిడిఎ పిఒగా, విశాఖపట్నం జాయింట్ కలెక్టర్‌గా, కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. జిల్లాల విభజన తర్వాత పలనాడు జిల్లాకు తొలి కలెక్టర్‌గా, తరువాత కడపజిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ తెలంగాణ రాష్ట్రం ముఖ్య కార్యనిర్వాహణ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. సన్యాసప్పుడు అంత్యక్రియలు ఆదివారం ఉదయం 11 గంటలకు ధర్మవరంలో నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు.

లోతేటి సన్యాసప్పడు

రక్తదానం చేస్తున్న యువకులు

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని గుణుపూర్‌పేటలో విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు సందర్భంగా శనివారం నిర్వహించిన అత్యవసర రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. రక్త నిల్వలు కొరత కారణంగా, తల సేమియా పిల్లలు, గర్భిణుల కోసం ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్. ఇల్తమాష్ తెలిపారు. ఈ సందర్భంగా నెల్లిమర్ల నియోజకవర్గ కో కన్వీనర్ నెయ్యిగాపుల రఘు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రతి ఒక్కరూ 18 సంవత్సరాల నుంచి అందరూ రక్తదానం చేయొచ్చు అని అన్నారు. ఈ రక్తదాన శిబిరంలో సుమారు 36 మంది యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చే రక్త దానం చేశారన్నారు. సేకరించిన రక్త నిల్వలు విజయ బ్లడ్ బ్యాంక్ రక్తనిధికి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం యూత్ ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు అనకాపల్లి అశోక్, సాయికుమార్, రాయల్ క్యాబ్స్ శరత్, రఘు, రాము, పి.రఘు, విజయ్, వినయ్, సాయి, విజయ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ పుణ్యమంతుల శివ పాల్గొన్నారు.

భోగి మంటల్లో విద్యుత్తు బిల్లుల దహనం

సిపిఎం పిలుపు

ప్రజాశక్తి-బొబ్బిలి

భోగి మంటల్లో విద్యుత్తు బిల్లులు దహనం చేసి నిరసన తెలిపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు ప్రజలను కోరారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమిని గెలిపిస్తే విద్యుత్తు ఛార్జీలు పెంచే ప్రసక్తి లేదని చెప్పిన చంద్రబాబు ఆరు నెలల్లో రెండు సార్లు ట్రూఅప్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు వేశారని విమర్శించారు. విద్యుత్తు ఛార్జీలను తగ్గించి ట్రూ అప్ ఛార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం, నాయకులు సురేష్, పుణ్యవతి పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

డిఎస్‌పి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని గొల్లవీధిలో చర్చి నిర్మాణ విషయంపై హిందూ, క్రైస్తవ మతాల పెద్దలకు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇరువురు సంయమనం పాటించాలని, వివాదాస్పద స్థలంలో పోలీస్ పికెట్ కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ సతీష్‌కుమార్, తహశీల్దార్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈవినింగ్ వాకర్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉడా కాలనీ పేజ్-3 పార్క్ ఈవినింగ్ వాకర్స్ క్లబ్ నూతన కమిటీని శనివారం ఎన్నికైంది. కమిటీ సభ్యులచే డిస్ట్రిక్ట్ గవర్నర్-102 కె.మురళీధర్ క్లబ్ అభివృద్ధికి నిబద్ధతతో, పారదర్శకంగా కృషి చేస్తామని ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం గవర్నర్-102 మురళీధర్ మాట్లాడుతూ నడకతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. నడక, యోగా వంటి వ్యాయామాలు ప్రతిరోజు క్రమం తప్పకుండా చేస్తే మానసిక శారీరక ఉల్లాసం లభిస్తుందని పేర్కొన్నారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా జామి అప్పలసూరి, కార్యదర్శిగా టి.చిన్నారావు, కోశాధికారిగా కె.ఆదినారాయణ, సభ్యులుగా త్యాడ చిరంజీవి రావు, పి.జాన్ విక్టర్, నారాయణరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ వ్యవస్థాపకులు కె.ఎర్నాయుడు, గౌరవాధ్యక్షుడు సింగు మహంతి గౌరీ ప్రసాద్, 102-క్లబ్ ఏరియా కోఆర్డినేటర్లు వి.సుబ్బరాజు, ఎస్ఎస్ఎస్‌వి ఆర్ఎం రాజు, డాక్టర్ ఎఎస్ ప్రకాష్, ఎలెక్టెడ్ గవర్నర్ ఎ.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సిబిఎం పాఠశాలను రెన్యువల్ చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలో వందేళ్ల చరిత్ర కలిగిన సిబిఎం బాలికల ఉన్నత పాఠశాల గుర్తింపును రెన్యువల్ చేయాలని సిపిఐ జిల్లా నాయకులు కోట అప్పన్న ప్రభుత్వాన్ని కోరారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సిబిఎం పాఠశాల అక్రమ రిజిస్ట్రేషన్ రద్దుచేసి, విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. తప్పుడు రిజిస్ట్రేషన్ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు వి.శ్రవణ్ కుమార్, సిపిఐ పట్టణ నాయకులు వై.బాబ్జి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘు వర్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు నూతలపాటి పరమేశ్వరరావు స్ఫూర్తితో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ తెలిపారు. పరమేశ్వర రావు తృతీయ వర్ధంతి సందర్భంగా జెడ్‌పి మినిస్టీరియల్ భవనంలో శనివారం విద్యా సదస్సు జరిగింది. జిల్లా అధ్యక్షులు షేక్ బుఖారిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రఘువర్మ మాట్లాడుతూ పరమేశ్వరరావు ఉపాధ్యాయులకు, ఎపిటిఎఫ్ సంఘానికి చేసిన సేవలను కొనియాడారు. రానున్న కాలంలో సిపిఎస్ రద్దుకు, ఇంగ్లీష్ మీడియం తో సమాంతరంగా తెలుగు మీడియం పునరుద్ధరణకు పోరాటం చేయవలసిన అవసరం ఉందని తెలిపారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సరస్వతి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాటాలు చేయవలసిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్, జిల్లా నాయకులు పిల్లా తిరుపతి రావు, ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఎపిటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు జోగినాయుడు, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామీణ బజార్ ప్రారంభం

ప్రజాశక్తి-గజపతినగరం

గజపతినగరంలో నూతనంగా నిర్మించిన గ్రామీణ బజార్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డు నిధులు రూ.15 లక్షలు, పంచాయతీ నుంచి రూ.5 లక్షలు సమకూర్చి, 32 షాపులతో ఈ బజారును నిర్మించినట్లు తెలిపారు. లాటరీ పద్ధతిలో షాపులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఎండకు ఎండి, వర్షానికి తడిచి నీడ లేకుండా దుకాణదారులు అనేక ఇబ్బంది పడ్డారని, ప్రస్తుతం ఆ సమస్యను అధిగమించడం సంతోషంగా ఉందని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా సమిష్టిగా ఈ బజారును అభివృద్ధి చేసుకోవాలని ఉత్తరాంధ్రలో ఒక మోడల్‌గా దీనిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బొండపల్లి మండల నాయకులు తమ మండలంలో కూడా ఇలాంటి బజార్ ఏర్పాటు చేయాలని కోరగా, తప్పకుండా ప్రయత్నిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గార తవుడు, ఎంపిపి బెల్లాన జ్ఞానదీపిక, మాజీ ఎంపిపి గంట్యాడ శ్రీదేవి, టిడిపి నాయకులు గోపాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సహకార భారతి జెండా విష్కరణ

సహకార భారతి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆవిష్కరించారు. సహకార భారతి ఉత్తరాంధ్ర జిల్లాల కోఆర్డినేటర్లు ఎ.సర్వదేవుళ్ళు, మమ్ముల తిరుపతిరావు, శ్రీకాకుళం, విజయనగరం కన్వీనర్లు రౌతు సాంబమూర్తి, మార్పిన అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి మాట్లాడుతూ సహకార రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. సహకార భారతి తరపున రాష్ట్రంలో కూడా రైతు, మహిళా, యువత ఉపాధికి సొసైటీలు స్థాపించి తద్వారా సహకార రంగంలో పురోగతి కోసం ప్రయత్నించాలని సూచించారు. సహకార రంగ అభివృద్ధికి దేశ వ్యాప్తంగా పనిచేస్తున్నట్లు సహకార భారతి ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గార తవుడు, ఎంపిపి జ్ఞానదీపిక పాల్గొన్నారు.

గ్రామీణ బజారును ప్రారంభిస్తున్న రాష్ట్ర చిన్న,మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్

సజావుగా కానిస్టేబుల్ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ

ప్రజాశక్తి-విజయనగరంకోట

పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలకు ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు దేహ దారుఢ్య పరీక్ష సజావుగా కొనసాగుతోందని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం 10వ రోజు పిఎంటి. పిఇటి పరీక్షలకు 600 మంది పురుష అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 384 మంది మాత్రమే హాజరయ్యారు. వేకువ జామున 5గంటల నుండే ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. ఎస్‌పి వకుల్‌జిందాల్, ఎఎస్‌పి పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు స్వయంగా పర్యవేక్షించారు. అభ్యర్థులకు ముందుగా హాల్‌టిక్కెట్లు పరిశీలించి, పోలీసుపరేడ్ గ్రౌండులోకి అనుమతించారు. అనంతరం, అభ్యర్థుల విద్యార్హతలు, రిజర్వేషన్లు, వయస్సు నిర్ధారించే ధవపత్రాలను పరిశీలించి, అన్ని సర్టిఫికేట్స్ సక్రమంగా ఉన్న అభ్యర్థులకు మాత్రమే బయోమెట్రిక్ తీసుకొని పిఎంటి పరీక్షలకు అనుమతించారు. ఇప్పటి వరకు పురుష అభ్యర్థులు 2500 మంది శారీరక దారుఢ్య పరీక్షలకు హాజరుకాగా, వారిలో 1794మంది, మహిళా అభ్యర్థులు 983 హాజరుకాగా, వారిలో 479మంది తుది రాత పరీక్షకు అర్హత సాధించారని ఎస్‌పి తెలిపారు.. శారీరక దారుఢ్య పరీక్షలు ఈనెల 22వరకు పోలీసు పరేడ్ గ్రౌండులో కొనసాగుతాయని తెలిపారు.

లాంగ్‌జంప్ చేస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థి

గోకులాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

గోకులాలు ప్రారంభం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం గ్రామంలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన గోకులం షెడ్‌ను శనివారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను టిడిపి కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటీ నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతోందని చెప్పారు. మండలంలో సుమారు 121 గోకులాలను మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిని ఉపయోగించుకొని పాడి రైతులు అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, ఎపిఒ ఆదిలక్ష్మి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కె.రమణమూర్తి, మాజీ ఎంపిపి దాసరి లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : పాడి రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం గోకులాలు నిర్మిస్తోందని ఎంపిడిఒ రవికుమార్ అన్నారు. శనివారం పారాది పంచాయతీ పరిధిలో బంకురువలస, పిరిడి గ్రామాలలో గోకులాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల శాలలు ఎక్కువగా అగ్నిప్రమాదాలకు గురవుతుండటంతో దాని నివారణకు శాశ్వత షెడ్లు ఏర్పాటుకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఎడి విష్ణు, టిడిపి రాష్ట్ర నాయకులు అల్లాడి భాస్కరరావు, ఇఒపిఆర్‌డి భాస్కరరావు, ఎపిఒ లక్ష్మీపతిరాజు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితుడికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

బాడంగి మండలం వాడాడలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధితుడు వి.సన్యాసికి ఎమ్మెల్యే బేబినాయన ఆర్థిక సహాయం చేశారు. కోటలో శనివారం బాధితుడికి నగదు, దుప్పట్లు, నిత్యావసర సరుకులను అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని బేబినాయన అన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

అనారోగ్యంతో బాధ పడుతున్న కోమటిపల్లి గ్రామానికి చెందిన బోనెల జయలక్ష్మికి ఎమ్మెల్యే బేబినాయన సిఎం సహాయనిధి చెక్కు అందజేశారు. కొన్ని రోజులుగా జయలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. వైద్యానికి రూ.80 వేలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

బాధితులకు అండగా సిఎం సహాయనిధి

ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

ప్రజాశక్తి-లక్కవరపుకోట

వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి ఉంటుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శనివారం లక్కవరపుకోటలోని తన క్యాంపు కార్యాలయంలో మింది సృజన, ఏలూరు రాంబాబు, పెద్దిరెడ్ల పద్మావతి, మంచిన అప్పలకొండకు సుమారు రూ.6.60 లక్షల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెరుగైన వైద్యం నిమిత్తం ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొందిన బాధితులు చెల్లించిన నగదు రశీదులతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేస్తే, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఒబ్బిన సత్యనారాయణ, మాజీ జడ్‌పిటిసి సభ్యులు కరెడ్ల ఈశ్వరరావు, రాయవరపు చంద్రశేఖర రావు, మాజీ సర్పంచ్ ప్రసాద్, కె.రాముడు, కె.ఈశ్వరరావు, రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కొత్త బొద్దాం వద్ద 1189 కిలోల పిడిఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు శనివారం పట్టుకున్నారు. వ్యానులో బియ్యం తరలిస్తుండగా గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో విజిలెన్స్ సిఐ సింహాచలం, సివిల్ సప్లై డిటి రామకృష్ణ దాడులు చేశారు. 6ఎ కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లై డిటి రామకృష్ణ తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని బొద్దాం-2 డిపోకు అప్పగించారు. వ్యానును వల్లంపూడి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

స్వాధీనం చేసుకున్న వ్యాను వద్ద విజిలెన్స్, సివిల్ సప్లై అధికారులు

కానిస్టేబుల్ సస్పెన్షన్

ప్రజాశక్తి-విజయనగరంకోట

గంజాయి కోసం చేపట్టిన సోదాల్లో చేతివాటం ప్రదర్శించిన నెల్లిమర్ల పోలీసు కానిస్టేబుల్ కృష్ణకిశోర్‌ను విధుల నుంచి తొలగించినట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు మూడు నెలల క్రితం నెల్లిమర్ల పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు నెల్లిమర్ల ఎస్ఐ, పోలీసు సిబ్బంది ఒక విద్యార్థి గదిలో సోదాలు చేపట్టారు. ఆ సోదాల్లో కానిస్టేబుల్ ఎస్.కృష్ణకిశోర్ చేతివాటం ప్రదర్శించినట్లుగా పోలీసు అధికారులు చేపట్టిన విచారణలో వెల్లడైంది. దీంతో ఆయన్ను విధుల నుండి సస్పెండ్ చేస్తూ ఎస్‌పి ఉత్తర్వులు జారీచేశారు.

మైనింగ్ క్వారీలో పడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-చీపురుపల్లి

మండలంలోని పేరిపి, ఇటికర్లపల్లి మధ్యలో ఉన్న పరమేశ్వరి మైనింగ్ క్వారీలో పడి కొంగరాపు రాములు (65) అనే వృద్ధుడు మృతి చెందాడు. శనివారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి చీపురుపల్లి ఎస్ఐ ఎల్ దామోదర్ తెలిపిన వివరాలు ప్రకారం.. గరివిడి మండలం శివరాం గ్రామానికి చెందిన కొంగరాపు రాములు గత కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 2న పింఛను తీసుకొని ఇంటి నుండి వెళ్లిపోయాడు. ఆయన కోసం కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఫలితం లేకపోయింది. శనివారం కొంతమంది క్వారీ వైపు వెల్లడంతో క్వారీలో పడి ఉన్న డెడ్ బాడీని చూసి సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం కోసం పంపించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ దామోదర్ రావు తెలిపారు.

లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-డెంకాడ

మండల కేంద్రం డెంకాడలో లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. డెంకాడ వద్ద రోడ్డు దాటుతుండగా విజయనగరం నుంచి నాతవలస వైపు వెళ్తున్న లారీ అతడ్ని ఢీకొంది. దీంతో ఆయన తలకు తీవ్ర గాయాలై కోమాలోకి వెళ్లిపోయాడు. స్థానికులు 108 వాహనం ద్వారా జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు, మృతుడి వయసు 40ఏళ్లు ఉంటుంది. ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

700 గ్రాముల గంజాయి సీజ్

ప్రజాశకి-గజపతినగరం

బాలురకు అమ్ముతున్న 700 గ్రాములు గంజాయిని సీజ్ చేసినట్లు బొబ్బిలి డిఎస్‌పి పి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.ఒడిశా నుంచి వచ్చి బొండపల్లిలో నివాసం ఉంటున్న కె.నవీన్ కుమార్(24) మరొక మైనర్ వ్యక్తితో కలిసి 700 గ్రాముల గంజాయిని మైనర్లకు అమ్ముతున్నట్లు స్థానిక ఎస్ఐ కె.లక్ష్మణరావుకు సమాచారం వచ్చింది. ఇఒపిఆర్‌డి సిహెచ్ సుగుణాకరరావు కలిసి వెళ్లి పురిటిపెంట బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ దగ్గర రైల్వే గేట్ సమీపంలో పారిపోతుండగా వీరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిలో ఇద్దరు ఇంటర్ చదువుతున్నారు. సమావేశంలో సిఐ జివివి రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ప్రాణం తీసిన దొంగతనం

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలోని అశోక్‌నగరకు చెందిన గొడ్డు శంకరరావు (24) శుక్రవారం రాత్రి సుమారు 12 గంటల సమయంలో మంగళగిరి సాయి , మంగళగిరి చరణ్‌తో కలిసి ఉమా రామలింగేశ్వర స్వామి గుడి జంక్షన్ దగ్గర నిర్మాణంలో ఉన్న ఒక అపార్టుమెంటులో కరెంట్ వైర్లు దొంగతనం చెయ్యడానికి వెళ్లాడు. ఆ రాత్రి 1.30గంటల సమయంలో 5వ అంతస్తులో ఉన్న రెండు గదులలో ఉన్న కరెంట్ వైర్‌లు, కత్తిరించి ఆ పక్కనే ఉన్న లిఫ్ట్ కోసం ఉన్న ఖాళీ ప్రదేశంలో ప్రమాదవశాత్తు కాలు జారి 5వ అంతస్తు నుంచి కిందపడి మృతి చెందాడు. శనివారం అతని భార్య రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేసి టూటౌన్ సిఐ శ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నారు.

రాజాపులోవ వద్ద లారీ బోల్తా

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని రాజాపులోవ జాతీయ రహదారిపై శనివారం ఉదయం లారీ బోల్తా పడింది. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు ఉల్లిపాయల లోడుతో వెళుతున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఇందులో ఉన్న డ్రైవరు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఉల్లిపాయలు చోరీ కాకుండా చూసుకున్నారు. శుక్రవారం ఉదయం కూడా ఇదే ప్రాంతంలో చేపలు లోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడటం విశేషం. ఈ ప్రమాదంలో కూడా ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు.

'భీమసింగి'పై మంత్రి దృష్టి సారించాలి : భీశెట్టి

ప్రజాశక్తి - జామి

జిల్లాలో సహకార రంగంలో గొప్ప చరిత్ర కలిగిన భీమసింగి చక్కెర పరిశ్రమ మూత పడి ఐదేళ్లు గడుస్తోందని, వెంటనే ఫ్యాక్టరీని తెరిపించడానికి గాని, మరో పరిశ్రమగా మార్చేందుకు గాని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి సారించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. శనివారం జామిలో విలేకరులతో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం అనవసరంగా ఫ్యాక్టరీని మూసేసి రైతులకు, కార్మికులకు అబద్దాలు చెప్పి సర్వనాశనం చేసిందన్నారు. భీమసింగి చక్కెర ఫ్యాక్టరీకి రాష్ట్రంలోనే గొప్ప చరిత్ర ఉందని, అటువంటి ఫ్యాక్టరీ పరిస్థితి నేడు చూస్తే గుండె తరుక్కుపోతుందని అన్నారు. ఫ్యాక్టరీని నమ్ముకున్న ఉద్యోగులు, కార్మికులు చాలా నష్టపోయారని తెలిపారు. పండగపూట కూడా ఆనందం లేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. మంత్రి కొండపల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ పరిధిలోని ఉన్న భీమసింగి చక్కెర ఫ్యాక్టరీని ప్రభుత్వం ఇథనాల్ పరిశ్రమగా కూడా మార్చి రైతులకు, కార్మికులకు అవకాశం కల్పించే దిశగా అడుగులు వెయ్యాలని కోరారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని అయ్యన్నపేట జంక్షన్‌లో గల మదర్ థెరిసా కిడ్స్ స్కూల్లో మదర్ థెరిసా సేవాసంఘం అండ్ బ్లడ్ డోనర్స్ క్లబ్, కిడ్స్ స్కూల్ సంయుక్తంగా శనివారం నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సేవా సంఘం-అధ్యక్షులు మరియు మదర్ తెరిసా కిడ్స్ స్కూల్-ప్రిన్సిపాల్ త్యాడ ప్రసాద్ పట్నాయక్ ఆధ్వర్యంలో వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మదర్ థెరిసా సేవా సంఘం గౌరవ అధ్యక్షులు త్యాడ వేణుగోపాలం, సభ్యులు నూతన్, తనీష్, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం లోడింగ్ ఛార్జీలు చెల్లించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 2021-22లో ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలించిన రైతులకు లోడింగ్, అన్ లోడింగ్, రవాణా ఛార్జీలను చెల్లించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం డిమాండ్ చేశారు. వ్యవసాయ సహకార సొసైటీ ఆవరణలో శనివారం ఆయన మాట్లాడుతూ ధాన్యం రైతులకు లోడింగ్, అన్ లోడింగ్, రవాణా ఛార్జీలను చెల్లిస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు సొంత ఖర్చులతో ధాన్యాన్ని తరలించారన్నారు. ధాన్యం లోడింగ్, అన్ లోడింగ్, రవాణా ఛార్జీలు చెల్లించకపోవడంతో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తే నిధులను ప్రభుత్వం సొసైటీలకు జమ చేసినప్పటికీ రైతులకు ఇవ్వడం లేదన్నారు. తక్షణమే సొసైటీ అధికారులు స్పందించి రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మురళీ పాల్గొన్నారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి సచివాలయ పరిధిలోని గ్రామాల్లో వేపాడ పిహెచ్‌సి ఆధ్వర్యాన క్షయ నిర్ధారణ పరీక్షలు చేశారు. శనివారం జగ్గయ్యపేట, అరిగిపాలెం గ్రామాల్లో 85 మందికి ఎక్స్‌రేలు తీసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి ఎ.ధరణి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ ఆంజనేయులు, హెచ్‌డబ్ల్యుసిఎంఎల్‌హెచ్‌పి సిహెచ్‌ఒ పి.పార్థసారథి, హెల్త్ సూపర్‌వైజర్ జివిఎన్ఎస్ఎన్ మూర్తి, హెల్త్ అసిస్టెంట్ ఎస్.సాయిబాబా, సిహెచ్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ఆలయాన్ని సందర్శించిన జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని అన్నంరాజుపేట గ్రామంలో ఉన్న వేణుగోపాలస్వామి ఆలయాన్ని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం సందర్శించారు. స్థానిక వైసిపి నాయకులతో కలిసి ఆలయంలో ఆయన పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి.సత్యవంతుడు, కెఆర్‌పేట సర్పంచ్ బాలబాబు, మాజీ సర్పంచి పైడిబాబు, మండల నాయకులు శ్రీను, వైస్ సర్పంచ్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

Notice
IN THE COURT OF THE HON'BLE V ADDL. DIST. JUDGE:: GUNTUR
M.V.O.P.No:1266/2023

Between:
Kuppala Ramesh Kumar.......Petitioner
AND
Gadapu Rama Rao & Others
...Respondents

To,
R-1: Gadapu Rama Rao,S/o.Satyam Naidu,Kummiri,Komarada, Vizianagaram Dist. (Driver of Toyota Innova Car Bearing No. AP-39-X-1818

పై నెంబరు కేసులో పిటీషనరుకు యాక్సిడెంటులో తగిలిన దెబ్బలుకు నష్టపరిహారం కోరుచూ పిటీషన్ దాఖలు చేయగా సదరు O.P. లో1వ రెస్పాండెంట్ అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది:24-02-2025 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం మీ పరోక్షమున విచారించి తీర్మానించ బడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:24-02-2025

యస్.కాలేషా,
పిటీషనరు తరపు అడ్వకేట్, గుంటూరు.